

కొనుగోళ్లలో వేగం పెంచండి

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరగకుండా వేగం పెంచాలని అధికారులను కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. - 8లో



చెరువులకు జలకళ

మల్లన్నసాగర్ నుంచి గోదావరి జలాలు విడుదల చేయడంతో చెరువులు జలకళను సంతరించుకుంటున్నాయి. -9లో



సాగర్ గేట్లు మూసివేత

ఎగువనుంచి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో నాగార్జునసాగర్ క్రస్‌గేట్లు పూర్తిగా మూసివేశారు. - 10లో

న్యూస్‌రీల్

మంత్రి కోమటిరెడ్డి దీపావళి శుభాకాంక్షలు

నల్లగొండ: దీపావళి పండగ సందర్భంగా ప్రజలకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో పదేళ్ల చీకటిని పారద్రోలి ప్రజలు వెలుగు రేఖలు సృష్టించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రజాపాలనపై విషం చిమ్ముతున్న అజ్ఞానులకు.. జ్ఞానదీపం వెలిగేలా లక్ష్మీదేవి ఆశీర్వదించాలని మంత్రి కోరారు. చిన్నారులు టపాసులు కాల్చేటప్పుడు తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకొని వెలుగుల పండగను సంతోషాలతో జరుపుకోవాలని మంత్రి ఆకాంక్షించారు.

3నుంచి స్పోకెన్ ఇంగ్లిష్ ఉచిత తరగతులు

భువనగిరి : శక్తి మిషన్, జై భీమ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నవంబర్ 3నుంచి స్పోకెన్ ఇంగ్లిష్ ఉచిత తరగతులు నిర్వహించనున్నట్లు శక్తి మిషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కర్తాల శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భువనగిరిలోని శ్రీ గాయత్రి బాలికల జూనియర్ కళాశాలలో సాయంత్రం 6.30నుంచి రాత్రి 7.30వరకు తరగతులు ఉంటాయని, ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరూ హాజరుకావచ్చన్నారు. సెల్ నంబర్ 93919 54727ను సంప్రదించి పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

స్వర్ణ తాపడానికి విరాళం



దేవస్థానం ఈఓ భాస్కర్‌రావుకు చెక్కు అందజేస్తున్న కనకయ్య దంపతులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ దివ్య విమానగోపురానికి బంగారు తాపడం కోసం సిరిసిల్లకు చెందిన నెల్లుట్ల కనకయ్య-వరలక్ష్మీ దంపతులు రూ.1,51,111 విరాళం అందజేశారు. ఇందుకు సంబంధించిన చెక్కును బుధవారం దేవస్థానం ఈఓ భాస్కర్‌రావుకు ఇచ్చారు. అంతకుముందు కనకయ్య దంపతులు స్వామి, అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఫీజు దీక్ష



భువనగిరిలోని ప్రిన్స్ చౌరస్తాలో దీక్ష చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

భువనగిరి : స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు బుధవారం భువనగిరిలోని ప్రిన్స్ చౌరస్తాలో దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతల శివ, లావుడియా రాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం బాటలోనే కాంగ్రెస్ సర్కార్ కూడా విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఏళ్ల తరబడి ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు ఇవ్వకపోవడంతో పేద విద్యార్థులు చదువులకు స్వస్తి పలుకుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు రోడ్ల మీదకు వచ్చి పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. తక్షణమే బకాయిలు విడుదల చేయని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాల సంఘం జిల్లా అధ్యక్షుడు సింగనబోయిన మల్లేశం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొండమడుగు నర్సింహ, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అన్నంపట్ల కృష్ణ, ఎస్‌ఎఫ్‌ఐ మాజీ జిల్లా కార్యదర్శి వనం రాజు,నాయకులు ఈర్ల ముత్యాలు, ఎండీ సలీం పాల్గొన్నారు. వీరికి కళాశాలల ప్రిన్సిపాళ్లు శ్రవణ్‌కుమార్‌రెడ్డి, పరుశురాం, యాకుబ్ సంఘీభావం తెలిపారు.



టపాసులు కాలుస్తున్న మహిళలు (ఫైల్)

చీకటిని పారదోలి.. వెలుగులు నింపి

నేడు దీపావళి పండుగ.. నోములు, వ్రతాలకు సిద్ధమైన ప్రజలు

యాదగిరిగుట్ట, భువనగిరి, రామగిరి(నల్లగొండ), నకిరేకల్: విజయానికి ప్రతీకగా.. చీకటిని పారదోలి జీవితాల్లో వెలుగులు నింపే దీపావళి రానే వచ్చింది. లక్ష్మీ పూజలు, నోములు, వ్రతాలు ఆచరించేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. కేదారేశ్వర వ్రతం కొందరు దీపావళి రోజు జరుపుకుంటే మరికొందరు కార్తీకమాసంలో పౌర్ణమి రోజు నిర్వహిస్తారు. ఆది దంపతులుగా భావించే పార్వతీపరమేశ్వరులను పూజిస్తూ ఈ వ్రతం ఆచరిస్తారు. ఈ నోము నోచుకోవడం వల్ల అష్టఐశ్వర్యాలు కలుగుతాయని, అన్నవస్త్రాలకు లోటు ఉండదని నమ్మకం.

దీపావళి ఇలా వచ్చింది..

పూర్వం నరకాసురుడు అనే రాక్షసుడు ప్రజలను హింసలు పెడుతుండగా సత్యభామ నరకాసురుడిని వధించడంతో ప్రజలు ఆనందంతో దీపావళి చేసుకుంటారని పురాణాలు చెబుతున్నాయి. అంతేకాకుండా శ్రీరాముడు అరణ్యవాసాన్ని పూర్తిచేసుకొని రాజ్యానికి తిరిగి వచ్చిన రోజుకు గుర్తుగా దీపావళి చేసుకుంటారని ప్రతీతి. అదేవిధంగా బలి చక్రవర్తిని శ్రీమహావిష్ణువు వామనావతారంలో భూమిలోకి అణగదొక్కిన రోజుగా పురాణాల్లో ఉంది.

టపాసులు ప్రత్యేకం

దీపావళి అంటేనే టపాసులు ప్రత్యేకం. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు టపాసులు కాల్చి ఆనందంగా గడుపుతారు. దీపావళిని పురస్కరించుకుని మార్కెట్‌లు కొనుగోలుదారులతో సందడిగా మారాయి.



భువనగిరిలో ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు

పటాకుల రేట్లు పేలుతున్నాయ్..

గత ఏడాది కంటే 30 నుంచి 40 శాతం అధికం

- కొనుగోలు చేయడానికి సామాన్య, మధ్య తరగతి ప్రజల వెనుకడుగు
- ట్రేడ్ లైసెన్స్ తీసుకోకుండానే దుకాణాలు ఏర్పాటు
- మున్సిపాలిటీలు, పంచాయతీల ఆదాయానికి గండి



టపాసులు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

భువనగిరి పట్టణంలోని మాసుకుంట వద్ద ఏర్పాటు చేసిన క్రాకర్స్ సెంటర్‌లో ఓ యువకుడు 13 రకాల టపాసులు కొనుగోలు చేశాడు. ఇందుకు గాను రూ.3,760 బిల్లు అయ్యింది. బిల్లు తగ్గించమని వ్యాపారిని కోరగా లేబర్, ట్రాన్స్‌పోర్టు, దుకాణాల అద్దె పెరిగిందని.. సాధ్యపడని చెప్పినట్లు సదరు యువకుడు వాపోయాడు. పండుగకు టపాసులు కాల్చడం ఆనవాయితీ కావడంతో.. బిల్లు మొత్తం చెల్లించినట్లు తెలిపాడు.

భువనగిరిటౌన్ : పటాకుల ధరలు పేలిపోతున్నాయి. ఈసారి ఏకంగా 30శాతం నుంచి 40శాతం మేర ధరలు పెంచేశారు. పండుగలకు పెళ్లిళ్ల సీజన్ తోడవడం, ఇదే అదనుగా వ్యాపారులు రేట్లు పెంచి అమ్ముతున్నారు. దీంతో సామాన్య, మధ్య తరగతి వర్గాల ప్రజలు నిరుత్సాహానికి గురవుతున్నారు. తప్పదు కాబట్టి కొద్దిమొత్తంలో కొనుగోలు చేస్తున్నారు.

వాతావరణంపైనే ఆశలు

వరుసగా రెండేళ్ల నుంచి దీపావళి సమయంలో వర్షాలు కురువడంతో వ్యాపారం కలిసిరాలేదని, ఈసారి వాతావరణం కలిసొస్తుందన్న ఆశతో క్రాకర్స్ సెంటర్ల నిర్వాహకులు ఉన్నారు. ఆ నమ్మకంతోనే పెద్ద ఎత్తున టపాసుల సెంటర్లు ఏర్పాటు చేశారు. భువనగిరి, చౌటుప్పల్, మోత్కూరు, యాదగిరిగుట్ట, ఆలేరు, భూదాన్‌పోచంపల్లి, బీబీనగర్ మున్సిపాలిటీల్లో టపాసుల కేంద్రాలు వెలిశాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 9 శాశ్వత దుకాణాలు ఉన్నాయి. దీపావళికి దుకాణాల ఏర్పాటుకు 70కి పైగా దరఖాస్తులు రాగా.. అందులో 50 మందికి అనుమతులు దక్కాయి. ఇందులో ఒక్క భువనగిరిలోనే 10 సెంటర్లు ఉన్నాయి.



కొన్ని టపాసుల ధరలు ఇలా.. (రూ.ల్లో)

రకం (ప్యాకెట్)	గత ఏడాది	ప్రస్తుతం
కాకర పుల్లలు	46	75
కాకర పూలు	20 నుంచి 60	30 నుంచి 100
చిచ్చుబుడ్డి (చిన్నవి)	40 నుంచి 60	60 నుంచి 80
చిచ్చుబుడ్డి (పెద్దవి)	60 వరకు	100
పెన్సిల్స్	35	50
1000 వాలా	220	300
500 థౌజెండ్ వాలా	800	1,200

సిండికేట్‌గా దోపిడీ!

ఓ వైపు దీపావళి.. మరోవైపు పెళ్లిళ్ల సీజన్ మొదలవడంతో వ్యాపారులు పెద్ద మొత్తంలో సరుకు తెప్పించిపెట్టారు. హైదరాబాద్‌లోని హోల్‌సేల్ మార్కెట్లయిన మలక్‌పేట, బేగం బజార్, రాణిగంజ్, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల నుంచి టపాసులు దిగుమతి చేసుకున్నారు. ప్రధానంగా దీపావళికి నాలుగైదు రోజులపాటు రూ.కోట్లలో వ్యాపారం జరుగుతుంది. అనధికార లెక్కల ప్రకారం రోజూ రూ.70లక్షల నుంచి కోటి రూపాయల వరకు అమ్మకాలు ఉంటాయి. మరోవైపు పెళ్లిళ్ల సీజన్ కావడంతో బరాత్‌ల కోసం భారీగా టపాసులు కొనుగోలు చేస్తుంటారు. వ్యాపారం జరిగే కొద్ది రోజుల్లో పెద్దమొత్తంలో సంపాదించుకోవాలన్న ఉద్దేశంతో వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధరలు పెంచేశారు.

అనుమతి తప్పనిసరి

> క్రాకర్స్ సెంటర్లు ఏర్పాటు చేయాలంటే అనుమతి పొందాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటాం. ఫైర్ సేఫ్టీ కోసం తమ వద్దకు వచ్చిన వ్యాపారులకు అనుమతులు ఇస్తున్నాం. ధరల విషయం మాకు సంబంధం లేదు.
>
> –మధుసూదన్‌రావు, అగ్నిమాపక శాఖ అధికారి

జీఎస్టీ, ముడి సరుకుల ధరలు తగ్గినా..

టపాసుల అమ్మకాలపై జీఎస్టీ 23 నుంచి 18 శాతానికి తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. మరో వైపు టపాసుల తయారీకి వినియోగించే ముడి సరుకుల ధరలు కూడా కొంతమేర తగ్గాయి. దీంతో ఈ ఏడాది రేట్లు తగ్గుతాయని అంతా భావించారు. కానీ, 30నుంచి 40 శాతం ఎక్కువకు విక్రయిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు

టపాసుల దుకాణాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి. మున్సిపాలిటీల్లో ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి. గ్రామ పంచాయతీల్లో అయితే ముందస్తుగా పన్ను చెల్లించి అనుమతి పొందాలి. కానీ, వ్యాపారుల్లో కొంతమంది మాత్రమే లైసెన్స్ పొందగా, మరికొందరు లైసెన్స్ తీసుకోకుండా అధికారులకు ఎంతోకొంత ముట్టజెప్పి క్రాకర్స్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఫలితంగా మున్సిపాలిటీలు, పంచాయతీల ఆదాయానికి గండిపడనుంది.

సర్వేలో పొరపాట్లకు తావుండవద్దు

- కలెక్టర్ హనుమంతరావు



బ్రాహ్మణపల్లిలోని ఐకేపీ కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

బీబీనగర్ : సమగ్ర కుటుంబ సర్వే వివరాల నమోదులో పొరపాట్లకు తావులేకుండా పటిష్టంగా చేపట్టాలని కలెక్టర్ హనుమంతరావు పేర్కొన్నారు. మాస్టర్ ట్రైనర్లకు సర్వేపై బీబీనగర్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం శిక్షణ ఇచ్చారు.ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై సర్వే లక్ష్యాలు, విధివిధానాలు, కార్యాచరణపై వివరించారు. జిల్లా కోడ్‌తో పాటు మండల, గ్రామ పంచాయతీ, హ్యాబిటేషన్ కోడ్ల తప్పక వేయాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి దోహదపడాలనే ఆశయంతో ప్రభుత్వం కుటుంబ సర్వే చేపడుతుందని, సకాలంలో ప్రక్రియను పూర్తి చేయాలన్నారు.

కొనుగోలు కేంద్రంలో ధాన్యం పరిశీలన

బ్రాహ్మణపల్లిలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. కాంటా చేసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కేంద్రం సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి, బీబీనగర్ మండల ప్రత్యేకాధికారి సుభాషిణి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

• వడ్లు వర్షార్పణం



జిల్లాలోని రామన్నపేట, భూదాన్‌పోచంపల్లి, ఆలేరు మండలాల్లో బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయ్యింది. సకాలంలో కాంటా వేయకపోవడం, టార్పాలిన్లు ఇవ్వకపోవడంతో ధాన్యం తడిసిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షపు నీటిలో కొట్టుకుపోయిన వడ్లను దగ్గరకు చేర్చేందుకు అష్టకష్టాలు పడ్డారు.

నిర్వాసితులకు న్యాయం చేయండి

- బండి సంజయ్‌ను కలిసిన రీజినల్ రింగ్ రోడ్డు నిర్వాసితులు



కేంద్రమంత్రి బండి సంజయ్‌కు వినతిపత్రం అందజేస్తున్న రీజినల్ రింగ్ రోడ్డు నిర్వాసితులు

చౌటుప్పల్ : రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని కోరుతూ చౌటుప్పల్ ప్రాంతానికి చెందిన నిర్వాసితులు బుధవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఉత్తర భాగాన ఇష్టారీతిలో అలైన్‌మెంట్ మార్చారని, ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రోడ్డు మధ్య దూరం 40 కిలో మీటర్లు ఉండాలని, కానీ.. చౌటుప్పల్, భువనగిరి, గజ్వేల్ ప్రాంతాల్లో 28 కిలో మీటర్లకు కుదించారని పేర్కొన్నారు. కొందరి ప్రయోజనాల కోసం అలైన్‌మెంట్ మార్చిడి చేయడంతో విలువైన వ్యవసాయ భూములు, నివాసగృహాలు, ఇళ్ల స్థలాలు కోల్పోవాల్సి వస్తుందన్నారు. బహిరంగ మార్కెట్‌లో ఎకరం రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్లు పలుకుతుందని, ప్రభుత్వం కేవలం రూ.30లక్షల నుంచి రూ.40లక్షల వరకు పరిహారం ఇచ్చి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తుందన్నారు. అంతేకాకుండా జంక్షన్‌ను విస్తరించడం వల్ల మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాలు విడిపోతున్నాయన్నారు. అలైన్‌మెంట్ మార్చకపోతే ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు. నిర్వాసితులకు న్యాయం చేయాలని మంత్రిని వేడుకున్నారు. అందుకు మంత్రి స్పందిస్తూ ఉత్తరభాగంలో విచారణ చేయిస్తామని, నిర్వాసితులకు అన్యాయం జరగకుండా చూస్తామని హామీ ఇచ్చినట్లు నిర్వాసితులు తెలిపారు. మంత్రిని కలిసినవారిలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి,చౌటుప్పల్ సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పెద్దిటి బుచ్చి రెడ్డి, కౌన్సిలర్ గోపగోని లక్ష్మణ్‌గౌడ్, భూనిర్వాసితులు గుజ్జుల సురేందర్ రెడ్డి, మారుపాక లింగం, చింతల ప్రభాకర్‌రెడ్డి, జాల శ్రీశైలం, జాల జంగయ్య, చింతల సుధాకర్‌రెడ్డి, బోరెం ప్రకాష్‌రెడ్డి, జాల వెంకటేష్,గుండెబోయిన గాలయ్య, జాల నర్సింహ, వేణు, జోసెఫ్, కార్తీక్, కనకరాజు, యాదయ్య తదితరులు ఉన్నారు.



నృసింహుడికి సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో బుధవారం సంప్రదాయ పూజలు ఆగమశాస్త్రం ప్రకారం ఘనంగా నిర్వహించారు.వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు.. సుప్రభాత సేవతో స్వయంభూలను మేల్కొలిపారు. అనంతరం ప్రతిష్టా అలంకారమూర్తులకు అర్చన, అభిషేకం చేశారు. ఇక ప్రధానాలయ ముఖమండపంలో అష్టోత్తర పూజలు, ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం, సువర్ణ పుష్పార్చన, నిత్యకల్యాణం, జోడు సేవోత్సవంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామివారికి శయనోత్సవం చేసి ఆలయాన్ని మూసివేశారు.

ఉత్సవమూర్తులకు హారతినిస్తున్న అర్చకుడు

వాహనాలకు తుప్పు.. ఎవరిది తప్పు!

సీజ్ చేసిన వాహనాలతో నిండిపోతున్న పోలీస్‌స్టేషన్లు

- తీసుకెళ్లడానికి ముందుకురాని యజమానులు
- వేలం వేయకుండా చోద్యం చూస్తున్న పోలీసు శాఖ
- తుప్పు పడుతున్న వాహనాలు
- కార్లు, ఆటోల విడి భాగాలు మాయం



చౌటుప్పల్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో శిథిలావస్థకు చేరిన ద్విచక్ర వాహనాలు, కార్లు

చౌటుప్పల్ రూరల్ : గంజాయి సరఫరా చేస్తూ, నిబంధనలు విరుద్ధంగా డ్రైవింగ్ చేస్తూ.. ఇతర ఏ కారణాలతోనైనా పోలీసులకు పట్టుబడిన వాహనాలను యజమానులు ధ్రువీకరణ పత్రాలు చూపించి, జరిమానా చెల్లించి తీసుకెళ్లాలి. కానీ, అటువంటి ప్రయత్నం చేయకపోవడంతో వందలాది వాహనాలు పోలీస్ స్టేషన్‌లో తుప్పపట్టిపోతున్నాయి. ఎండకు ఎండి, వానకు తడుస్తూ పనికిరాకుండా పోతున్నాయి. పట్టుబడిన వాహనాలను ప్రతి ఆరు నెలలకు ఒకమారు వేలం వేయాల్సి ఉండగా పోలీసులు సైతం ఏనాడూ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

చౌటుప్పల్ పీఎస్‌లో పేరుకుపోయిన వాహనాలు

చౌటుప్పల్ పోలీస్‌స్టేషన్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. ప్రమాదాలకు గురైన, కారణమైన వాహనాలను పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుంటారు. గంజాయి రవాణా చేస్తుండగా పట్టుబడ్డవి కొన్ని, సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలు ఇంకొన్ని ఉన్నాయి. పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్లతో పాటు సర్వీస్ రోడ్డు వెంట సుమారు 250 వాహనాలు ఉన్నాయి. ఇవన్నీ కేసులు తేలకపోవడంతో ఏళ్ల తరబడి స్టేషన్లలోనే ఉంటున్నాయి.



చౌటుప్పల్‌లోని సర్వీస్ రోడ్డులో కొన్నేళ్లుగా ఉన్న క్రేన్, తుప్పు పడుతున్న వాహనాలు

మాయమవుతున్న వాహనాలు, విడి భాగాలు

పట్టుబడిన వాహనాల కోసం యజమానులు రాకపోవడంతో దశాబ్దకాలంగా స్టేషన్లలోనే ఉంటున్నాయి. వీటిలో కండీషన్ ఉన్న వాహనాలను పోలీసులు వాడుతున్నట్లు గతంలో విమర్శలు వచ్చాయి. అంతేకాకుండా కార్లు, ఆటోల విడి భాగాలు మాయమవుతున్నాయి. ముఖ్యంగా రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో, సర్వీస్ రోడ్డులో ఉన్న వాహనాలకు రక్షణ లేకపోవడంతో వాటి భాగాలు చోరీకి గురవుతున్నాయి.

ఉన్నతాధికారులకు లిస్టు పంపుతాం



> వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఉన్నతాధికారుల అనుమతితో రాచకొండ హెడ్‌క్వార్టర్స్ పరిధిలో వేలం వేస్తున్నారు. గత ఏడాది ఫిబ్రవరిలో వేలం వేశారు. అయితే చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనాల కేసులు తేలలేదు. లెక్కలు తీసి వేలం వేయడానికి అనుకూలంగా ఉన్న వాహనాల లిస్టును త్వరలో ఉన్నతాధికారులకు పంపుతాం. తదుపరి వేలం తేదీలను ప్రకటిస్తాం.
>
> –మన్మథకుమార్, ఎస్‌హెచ్‌ఓ, చౌటుప్పల్

నిబంధనలు ఏం చెబుతున్నాయంటే..

ప్రమాదవశాత్తు లేదా ఇతర కారణాలతో సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చిన వాహనాలను రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా చేయాలి. అలా చేసిన వాహనాలను ఆరు నెలలకు ఒకసారి బహిరంగ వేలం ద్వారా విక్రయించాలి. కానీ, చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో పట్టుబడిన వాహనాలను వేలం వేయడానికి కనీస ప్రయత్నాలు చేయడం లేదు. వాహనాలను వేలం వస్తే ప్రభుత్వానికి కొంత మేర ఆదాయం సమకూరే అవకాశం ఉంది.



చౌటుప్పల్ రూరల్ పోలీస్‌స్టేషన్ ఎదుట..

క్లుప్తంగా

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దీపావళి

- శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



నల్లగొండ: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి పండుగ జరుపుకుంటామని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ బుధవారం ఆయన ఒక ప్రకటనలో దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అజ్ఞానాంధకారాన్ని పారదోలి జ్ఞానపు కాంతులు ప్రసరింపజేయాలనే తత్వాన్ని దీపావళి నేర్పుతుందని వెల్లడించారు. ఈ పండుగను తగు జాగ్రత్తలు పాటిస్తూ, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని అన్నారు.

జేఎన్‌వీలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పెంపు

పెద్దవూర: మండలంలోని చలకుర్తి క్యాంపు జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను తొమ్మిదో తరగతి, పదకొండో తరగతిలో ప్రవేశాలకు గాను దరఖాస్తు చేసుకోవడానికి నవంబర్ 9వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ ఆర్. నాగభూషణం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష 2025 ఫిబ్రవరి 8వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు www.navodaya.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పండుగ రద్దీ

బీబీనగర్: దీపావళి పండుగకు హైదరాబాద్ జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాల్లో ఉంటున్న ప్రజానీకం స్వగ్రామాలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో బుధవారం బీబీనగర్ మండలంలోని గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ నెలకొంది. సాయంత్రం నుంచి రాత్రి వరకు వరంగల్ వైపు కిలోమీటర్ మేర వాహనాలు బారులుదీరాయి.



'థర్మల్ ప్లాంట్' చోరీ నిందితుల అరెస్ట్

- రూ.15.35లక్షల నగదు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం
- పరారీలో మరో పది మంది..
- వివరాలు వెల్లడించిన మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖరరాజు

మిర్యాలగూడ అర్బన్: దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామంలో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో గత రెండు సంవత్సరాలుగా చోరీలకు పాల్పడుతున్న ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు మిర్యాలగూడ డీఎస్పీ కె. రాజశేఖర రాజు తెలిపారు. బుధవారం మిర్యాలగూడలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలను వెల్లడించారు. ప్లాంట్‌లో పనిచేస్తూ చోరీలకు పాల్పడి పోలీసులకు చిక్కిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన రంజిత్‌కుమార్ వర్మ, అభయ్ ప్రతాప్ మౌర్య ఇచ్చిన సమాచారం మేరకు పరారీలో ఉన్న మిర్యాలగూడ పట్టణం ఎన్ఎస్‌పీ క్యాంపునకు చెందిన షేక్ మునీర్, షేక్ మహ్మద్, దామరచర్ల మండలం ఇర్కిగూడేనికి చెందిన కంబాల అశోక్, గోపిశెట్టి అజయ్, పసుపులేటి కోటేశ్వర్‌రావు, షేక్ యాకుబ్‌పాషాతో పాటు సెక్యూరిటీ గార్డు పుల్లయ్యను బుధవారం పోలీసులు అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

రూ.6లక్షల సొత్తు రూ.లక్షకు విక్రయం

పవర్ ప్లాంట్‌లోని అల్యూమినియం రోల్స్‌ను బయటకు తీసుకొచ్చిన నిందితులు ఒక్క రోల్ విలువ రూ.6.5లక్షలు ఉండగా హైదరాబాద్‌కు చెందిన షేక్ శర్ఫుద్దీన్, ఖైరుద్దీన్, ముజీబ్, వహీద్ అలీకి కేవలం రూ.లక్షకే విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ప్లాంట్‌లో విలువైన వైర్లు చోరీకి గురికావడంతో గుర్తించిన దుర్గా క్రేన్ సర్వీస్ కాంట్రాక్ట్ కంపెనీ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో జిల్లా ఎస్పీ ఆదేశాలతో ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి మొత్తం 15మంది నిందుతులను గుర్తించారు. వారిలో ఈ ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.15.35లక్షల నగదు, 3 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మిగిలిన పది మంది నిందుతులను త్వరలోనే అరెస్ట్ చేస్తామని అన్నారు. ఈ కేసును ఛేదించిన మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు, సీసీఎస్ సీఐ జితేందర్‌రెడ్డి, సీసీఎస్ ఏఎస్ఐ అఫ్జల్ అలీ, హెడ్‌కానిస్టేబుల్ విష్ణువర్ధన్ గిరి, ఇమ్రాన్, వహీద్, లింగారెడ్డిను డీఎస్పీ అభినందించారు.

ప్రతీ రైతుకు మద్దతు ధర అందేలా చూస్తాం

- డీసీసీబీ ఛైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి



మునుగోడు: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ ఛైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

మునుగోడు: వానాకాలం సీజన్‌లో వరి పంట సాగు చేసిన ప్రతీ రైతుకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర అందేలా చూస్తామని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మునుగోడు మండలంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఐదు ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం డీసీసీబీ చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే రైతు రుణమాఫీ చేసిందన్నారు. అంతేకాకుండా పంటలకు మద్దతు ధర అందించేందుకు గ్రామాలల్లో విరివిగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. 8 శాతం లోపే తేమ ఉన్న ధాన్యానికి నూరుశాతం మద్దతు ధర దక్కుతుందన్నారు. అర్హులైన రైతులకు ప్రభుత్వం అతి త్వరలో రైతు భరోసా సాయం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో సీఈఓ సుఖేందర్, ఏఈఓ నర్సింహ, మాజీ సర్పంచ్‌లు జాల వెంకన్నయాదవ్, నడిపల్లి యాదయ్య, గుర్జ రామచంద్రం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, పీఏసీఎస్ డైరెక్టర్లు మేకల మల్లయ్య, జిట్టగోని యాదగిరి, దుబ్బ గోపాల్, వెంకన్న, నన్నూరి శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు దోటి నారాయణ, ఎండీ రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ..

నల్లగొండ టౌన్: జిల్లాలోని అన్ని సహకార కేంద్ర బ్యాంకుల్లో అధిక డిపాజిట్లు సేకరించటానికి కృషి చేయాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో డిపాజిట్ల సేకరణ మాసోత్సవ కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. డిపాజిట్లను సేకరించే విషయమై ఆయా బ్రాంచ్‌ల మేనేజర్లకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో బ్యాంకు ఉపాధ్యక్షుడు ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, సీఈఓ ఆర్. శంకర్‌రావు, ఏజీఎంలు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి ఇద్దరు యువకులు మృతి



మృతిచెందిన యువకులు

మోటకొండూరు: దీపావళి పండుగకు స్నేహితుడి ఊరికి వచ్చిన ఇద్దరు యువకులు సరదాగా చెరువులో ఈతకు వెళ్లి నీట మునిగి మృతిచెందారు. ఈ ఘటన మోటకొండూరు మండలం అమ్మనబోలు గ్రామ పంచాయతీ పరిధిలోని అబీద్‌నగర్ గ్రామంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అబీద్‌నగర్ గ్రామానికి చెందిన మల్లారెడ్డి, హేమ దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. వారి చిన్న కుమారుడు రాహుల్ హైదరాబాద్‌లోని రామాంతాపూర్‌లో గల శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. రెండు రోజులు దీపావళి సెలవులు ఉండడంతో రాహుల్‌తో పాటు అతడి స్నేహితులు 11మంది అబీద్‌నగర్‌కు వచ్చారు. బుధవారం వారంతా కలిసి ఈత కొట్టేందుకు గ్రామ శివారులోని చెరువు వద్దకు వెళ్లారు. చెరువులో ఈత కొడుతుండగా లోతైన గోతులు ఉండటంతో ప్రమాదవశాత్తు నీటమునిగి రాహుల్ స్నేహితులు శివదస్ (17), శ్రీచరణ్(17) మృతిచెందారు. సమీపంలోని అమ్మనబోలు గ్రామస్తులు వచ్చి వారిద్దరిని చెరువలో నుంచి బయటకు తీశారు. శ్రీచరణ్‌ది మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా బోడుప్పల్ కాగా.. శివదస్ అదే జిల్లా ఉప్పల్ ప్రాంతానికి చెందిన వాడని ఎస్ఐ పాండు తెలిపారు. విషయం తెలుసుకున్న ఏసీపీ రమేష్, సీఐలు కొండల్‌రావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పాండు తెలిపారు.

ఎంబీఏ ఫలితాలు విడుదల

నల్లగొండ రూరల్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఎంబీఏ జనరల్, ఎంబీఏ టీటీఎం సెమిస్టర్ 1, 2, 3, 4 రెగ్యులర్, బ్యాక్‌లాగ్ ఫలితాలను బుధవారం విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఉపేందర్‌రెడ్డి తెలిపారు. ఎంబీఏ జనరల్ 4వ సెమిస్టర్‌లో 200 మంది విద్యార్థులకు గాను 191 మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. ఫలితాలను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు.

రిటైర్డ్ ఏసీపీ అంజయ్యకు సతీవియోగం



పద్మావతి (ఫైల్)

అనంతగిరి: మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఏసీపీ బుడిగె అంజయ్య సతీమణి బుడిగె పద్మావతి(55) అనారోగ్యంతో బుధవారం మృతిచెందారు. గత 40 రోజులుగా ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. ఆమె భౌతికకాయాన్ని సాయంత్రం కిష్టాపురంలోని ఇంటికి తీసుకురాగా.. వివిధ సంఘాల నాయకులు, రాజకీయ ప్రముఖులు, పోలీస్ అధికారులు, ముదిరాజ్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చొప్పరి శంకర్, వాయిలసింగారం మత్స్యసహకార సంఘం చైర్మన్ కంటు నాగార్జున నివాళులర్పించారు.

కుటుంబ సర్వే పకడ్బందీగా చేపట్టాలి



చౌటుప్పల్ రూరల్: మాట్లాడుతున్న యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ గంగాధర్

చౌటుప్పల్ రూరల్ : సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని యాదాద్రి భువనగిరి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ సూచించారు. బుధవారం చౌటుప్పల్ మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లకు కుటుంబ సర్వేపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి వెళ్లి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాలను సేకరించాలన్నారు. 79 అంశాలతో నింపిన షెడ్యూల్ ఫారాన్ని జాగ్రత్తగా భద్రపరచాలని ఎన్యుమరేట్లకు సూచించారు. ఏ సమస్య తలెత్తినా వెంటనే అధికారులకు తెలియజేయాలని పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి పి.రవీందర్, ఎంపీడీఓ యాకూబ్‌నాయక్, ఎంపీఓ ఉట్కూరి అంజిరెడ్డి పాల్గొన్నారు.

పేదలకు పథకాలు అందే దిశగా సమగ్ర సర్వే

భువనగిరి: ప్రభుత్వ పథకాలు అర్హులైన పేద ప్రజలకు అందే దిశగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపడుతున్నట్లు అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. బుధవారం భువనగిరి మున్సిపాలిటీ కార్యాలయంలో ఇంటింటి సర్వేపై మెప్మా సిబ్బంది, రిసోర్స్‌పర్సన్స్, అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మృతి



నాగేందర్ నాయక్ (ఫైల్)

చివ్వెంల(సూర్యాపేట): అతివేగంగా వస్తున్న కారు అదుపుతప్పి బైక్‌ను ఢీకొట్టడంతో లంబాడా హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు మృతిచెందాడు. ఈ ఘటన చివ్వెంల మండల పరిధిలోని గుంజలూరు గ్రామ స్టేజీ వద్ద బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చివ్వెంల మండలం రాంకోటితండాకు చెందిన ధరావతు నాగేందర్(45) లంబాడా హక్కుల పోరాట సమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్నాడు. బుధవారం ఆయన బైక్‌పై కోదాడకు వెళ్తుండగా.. మార్గమధ్యలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై గుంజలూరు గ్రామ స్టేజీ వద్ద హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు వెనుక ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగేందర్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య ఇచ్చిన పిర్యాదు మేరకు ఎస్ఐ కనకరత్నం కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు.

గంజాయి తరలిస్తున్న యువకుల రిమాండ్

భువనగిరి క్రైం: గంజాయి తరలిస్తూ మంగళవారం భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి గ్రామ శివారులో పట్టుబడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నమయ్య జిల్లాకు చెందిన మల్లు వేణుగోపాల్‌రెడ్డి, భువనగిరి మండలం బొల్లెపల్లి గ్రామానికి చెందిన చెరుకుపల్లి శ్రీకాంత్, గుమ్మడెల్లి అర్జున్‌ను బుధవారం పోలీసులు కోర్టుకు రిమాండ్ చేశారు. మరో బాలుడిని నల్లగొండ జువెలిన్ కోర్టుకు తరలించినట్లు రూరల్ సీఐ చంద్రబాబు తెలిపారు. రెండు కార్లు, 35 కిలోల గంజాయి, 3 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ జి. వీరారెడ్డి

సాక్షి, యాదాద్రి: వానాకాలం ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ జీ. వీరారెడ్డి అన్నారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ధాన్యం కొనుగోలుపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్‌లు, ప్యాడీ క్లీనర్లు, తేమ మిషన్లు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలు ఆయాశాఖల అధికారులు సమకూర్చుకోవాలన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో సన్న, దొడ్డు రకం కేంద్రాలను వేర్వేరుగా ఏర్పాటు చేయాలన్నారు. సన్నధాన్యం గోనె సంచులను ఎర్ర దారంతో, దొడ్డు రకం ధాన్యం గోనె సంచులను ఆకుపచ్చ దారంతో కుట్టాలన్నారు. దొడ్డు ధాన్యం రవాణా చేసి సన్న ధాన్యంగా ఎంట్రీ చేస్తే ఆ ధాన్యం మొత్తం కొనుగోలు కేంద్రాల నుంచి వసూలు చేస్తామన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన లారీల నుంచి 8గంటల లోపే దిగుమతి చేసుకోవాలన్నారు. మిల్లుల్లో హమాలీల కొరత లేకుండా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సమావేశంలో వ్యవసాయ, సివిల్ సప్లై, మార్కెటింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్ టెలికాన్ఫరెన్స్

జిల్లాలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు, సమగ్ర కుటంబ సర్వేపై కలెక్టర్ హనుమంతరావు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. సమగ్ర కుటుంబ సర్వే నిబంధనల ప్రకారం పూర్తి చేయాలన్నారు.

బాలుడిపై లైంగిక దాడి కేసులో జైలుశిక్ష

ఖమ్మం లీగల్: జామపండ్లు కోసి ఇస్తానని నమ్మించి బాలుడిపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి 20ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కె. ఉమాదేవి బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన ఎస్‌కే. ఖాదర్ అలీ జీవనోపాధి కోసం ఖమ్మం వచ్చి మోమినాన్ బజార్‌లో నివాసముంటున్నాడు. 2021 నవంబర్ 27న పని నిమిత్తం నిజాంపేటకు చెందిన ఓ మహిళ ఇంటికి వెళ్లాడు. ఆమె తమ ఇంట్లో జామపండ్లు ఉన్నాయని, పిల్లలు ఉంటే చెట్టు ఎక్కించొచ్చని పక్క ఇంట్లో నివాసం ఉండే బాలుడి తల్లికి తెలిపింది. దీంతో బాలుడిని పంపించగా ఖాదర్ అలీ కాసేపటికి ఎవరూలేని సమయాన లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈమేరకు ఇంటికి వచ్చాక తల్లికి చెప్పడంతో డిసెంబర్ 1న ఖమ్మం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు ఖాదర్‌ను అరెస్ట్ చేయగా, విచారణ అనంతరం ఆయనకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ ఎ.శంకర్ వాదించగా, రషీద్, అయూబ్ సహకరించారు.

మహిళా కబడ్డీ విజేత నల్లగొండ జట్టు

- ముగిసిన రాష్ట్రస్థాయి పోటీలు

కొత్తగూడెంరూరల్: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పుట్టినరోజు సందర్భంగా కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు బుధవారం ముగిశాయి. ముగింపు సమావేశంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో పాటు వైరా, అశ్వారావుపేట, ఇల్లెందు ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, జారే ఆదినారాయణ, కోరం కనకయ్యతో పాటు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పురుషుల విభాగంలో ప్రథమ బహుమతి గెలుచుకున్న రంగారెడ్డి జిల్లా జట్టుకు రూ.75వేలు, ద్వితీయ బహుమతి మహబూబ్‌నగర్ జిల్లా జట్టుకు రూ.60 వేలు అందజేశారు. అలాగే, మహిళా విభాగంలో నల్లగొండ జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలవగా రూ.75 వేలు, రెండో స్థానంలో నిలిచిన రంగారెడ్డి జిల్లా జట్టుకు రూ.60 వేలు అందించారు. రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాల నుంచి 16 జట్లు హాజరు కాగా, అన్ని జట్లకు నగదు బహుమతులు అందజేశారు.

హత్యాయత్నం కేసులో ఆరుగురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్: పాలకవీడు మండలం జాన్‌పహాడ్ దర్గా వద్ద టీవీ విలేకరి వెచ్చా సందీప్‌పై జరిగిన హత్యాయత్నం చేసిన ఆరుగురిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చరమందరాజు తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో సీఐ విలేకరులకు వివరించారు. జాన్‌పహాడ్ గ్రామానికి చెందిన షేక్ జహంగీర్ బాబా కొన్నేళ్లుగా భార్యాపిల్లలతో కలిసి సూర్యాపేటలో ఉంటూ కారు నడుపుకుంటు జీవనం సాగిస్తున్నాడు. జహంగీర్ తండ్రి చనిపోవడంతో తల్లి జాన్‌పహాడ్‌లోనే ఉంటుంది. వెచ్చ సందీప్ స్వగ్రామం పాలకవీడు అయినప్పటికీ జాన్‌పహాడ్ దర్గా వద్ద ఓ ఇంట్లో కిరాణం దుకాణం నిర్వహిస్తూ టీవీ రిపోర్టర్‌గా పనిచేస్తున్నాడు. జహంగీర్ బాబాకు సందీప్‌తో పరిచయం కావడంతో ఇద్దరు మంచి స్నేహితులయ్యారు. జహంగీర్ బాబా జాన్‌పహాడ్ వచ్చినపుడు తన గ్రామానికి చెందిన షేక్ సలాముద్దీన్, దేశేశ్వర్ రావు, నర్సింహచారి, గోపి, షబ్బీర్, బాణోతు సైదులు కలిసి మద్యం తాగేవారు. ఆ సమయంలో జహంగీర్ గ్రామంలో తన ఒక్కడి మాటే చెలామణి కావాలని.. తాను ఏది చెబితే అదే జరగాలని స్నేహితులతో చెప్పేవాడు. సందీప్‌కు జహంగీర్ బాబా వ్యవహారం నచ్చక గ్రామంలో మంచిగా ఉండమని చెప్పడంతో వారిద్దరి మధ్య ఆధిపత్య పోరు ప్రారంభమైంది. వెచ్చ సందీప్ వినాయక చవితి సందర్భంగా దర్గా వద్ద ఉన్నవారికి వినాయకుడి విగ్రహం ఇప్పించాడు. అక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో తన ఫొటో ఎందుకు పెట్టలేదని జహంగీర్ బాబా సందీప్‌తో గొడవపడ్డాడు. నిమజ్జనం రోజున జహంగీర్‌కు కోమటికుంట యువకులకు గొడవ జరిగి ఒకరిపై ఒకరు పాలకవీడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఈ విషయంలో సందీప్ కోమటికుంట గ్రామస్తులకు సపోర్ట్ చేయడంతో జహంగీర్‌కు సందీప్‌పై మరింత కోపం పెరిగింది. ఈ నేపథ్యంలో సందీప్‌ను ఎలాగైనా అంతమొందించాలని ఈ నెల 27న తనకు తెలిసిన దేవుడమ్మ గుండ్లపహాడ్ గ్రామంలో కందూరు చేస్తుండగా జహంగీర్ తన స్నేహితుడైన ఫణిని వెంటబెట్టుకుని కారులో వచ్చాడు. అక్కడ తన స్నేహితులతో కలిసి మద్యం సేవిస్తుండగా ఈ మధ్యన సందీప్ బాగా ఎక్కువ చేస్తున్నాడని జహంగీర్‌ను స్నేహితులు రెచ్చగొట్టారు. దీంతో జహంగీర్ సందీప్‌ను బెదిరించాలనుకుని ఫణి, ఉబ్బపల్లి సందీప్, బాణోతు సైదులుతో కలిసి బైక్‌పై తన బంధువైన షేక్ సైదులు చికెన్ షాప్ వద్దకు వెళ్లారు. అక్కడ నుంచి వారందరూ కలిసి దర్గా వద్ద వెచ్చ సందీప్ ఇంటికి వెళ్లారు. ఉబ్బపల్లి సందీప్‌ను బయట కాపలా ఉంచి, జహంగీర్, ఫణి ఇద్దరు సందీప్ ఇంట్లోకి వెళ్లి ఎక్కడి నుండో వచ్చి ఇక్కడ పెత్తనం చేస్తున్నావు అని ప్రశ్నించారు. సందీప్ నేను అలాగే చేస్తానని చెప్పడంతో జహంగీర్ తన బండిలో తెచ్చుకున్న చికెన్ కొట్టే కత్తి తీసుకొని సందీప్‌పై విచక్షణరహితంగా దాడి చేశాడు. సందీప్ కేకలు వేయగా చుట్టుపక్కల వారు రావడంతో వారిని చూసి జహంగీర్, ఫణి ఇద్దరు వెచ్చ సందీప్ స్కూటీ వేసుకొని పరారయ్యారు. బుధవారం జాన్‌పహాడ్ శివారులో దాచిన ఎర్టిగా కారు తీసుకపోవడానికి వచ్చిన జహంగీర్, ఫణితో పాటు ఉబ్బపల్లి సందీప్, షేక్ సైదులు, బాణోతు సైదులు, షేక్ సలాంముద్దీన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఎర్టిగా కారు, 2 మోటార్ సైకిళ్లు, 5 సెల్‌ఫోన్లు, కత్తిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ సమావేశంలో పాలకవీడు ఎస్ఐ లక్ష్మీనరసయ్య, హుజూర్‌నగర్ ఏఎస్ఐ బలరాంరెడ్డి, ఐడీ పార్టీ కానిస్టేబుల్ నాగరాజు, శంబయ్య, కానిస్టేబళ్లు, హోంగార్డులు పాల్గొన్నారు.

మిరప పంటలో తెగుళ్లు–నివారణ చర్యలు

పాడి పంట

పెద్దవూర: గతేడాది పత్తి పంటలో పూర్తిగా దిగుబడి తగ్గడం, పెట్టుబడులు వెళ్లే పరిస్థితులు రాకపోవడంతో ఈ యేడాది జిల్లాలో అధిక విస్తీర్ణంలో రైతులు మిరప పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ పంట పక్వ దశలో ఉంది. అనేక చీడపీడలు వ్యాపించి రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. శిలీంద్రాలు, పురుగులు, సూక్ష్మధాతువు లోపాలతో పాటు నల్ల తామర పురుగు వ్యాప్తి ఉంది. కొమ్మ ఎండు, కాయకుళ్లు, బూడిద తెగుళ్లు, కాయతొలిచే పురుగుల వలన పంట నష్టపోయే ప్రమాదం ఉంది. మిరప పంటలో సరైన సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయని ఉద్యాన వన క్లస్టర్ అధికారి మురళి అంటున్నారు. మిరపలో తెగుళ్ల నివారణకు సంబంధించి సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే...



మిరప పంట

▶ కొమ్మ ఎండు – కాయ కుళ్లు తెగులు

మిరప పైరు పూత దశ నుంచి కాయ దశకు వచ్చే సమయాల్లో కొమ్మ ఎండు తెగులు, కాయ కుళ్లు తెగులు ఆశించే అవకాశం ఉంటుంది. వీటి కారణంగా కొమ్మ, కాయ మీద బూడిద రంగు మచ్చలు ఏర్పడుతాయి. వీటి ప్రభావంతో కొమ్మలు పైనుంచి కింది వరకు ఎండిపోతాయి. కాయ మీద మచ్చలు చిందరవందరగా ఏర్పడతాయి. వీటితో శిలీంధ్ర ఉత్పత్తి కణాలు ఉండటంతో కాయ సహజ రంగును కోల్పోతుంది.

నివారణ చర్యలు :

వీటి నివారణకు ఎకరం పొలానికి 200 లీటర్ల నీటిలో 200 మి.లీ. ప్రొపికానజోల్ లేదా 100 మి.లీ. డైఫెన్‌కొనజోల్, లేదా 200 గ్రాముల పైరాక్లో స్ట్రోబిన్‌ను కలిపి పిచికారీ చేయాలి.

▶ బూడిద తెగులు

చలి, తేమ వంటి వాతావరణ మార్పులతో బూడిద తెగులు సోకుతుంది. ఈ తెగుళ్లను కలుగజేసే శిలీంధ్రం వలన ఆకు కింది భాగంలో బూడిద రంగులో తెల్లటి పొడి ఏర్పడుతుంది. దీని వలన ఆకు ఆకుపచ్చ రంగును కోల్పోయి పసుపు రంగులోకి మారి రాలిపోతుంది.

నివారణ చర్యలు :

ఎకరాకు 200 లీటర్ల నీటిలో 300 గ్రాముల గంధకం లేదా 200 మి.లీ.ల డైనోకాప్ లేదా బెలటాన్, లేదా అజాక్సీస్ట్రోబిన్‌లను కలిపి పిచికారీ చేయాలి. లేదా లీటర్ నీటిలో 200 మి.లీ.ల ట్రై డిమార్ఫ్ కలిపి పిచికారీ చేయవచ్చు.

▶ కాయ తొలిచే పురుగు

కాయ తొలిచే పురుగు కాయలను రంధ్రం చేసి లోపలి భాగాన్ని తినడం వలన కాయ రాలిపోవడం లేదా కాయ పరిమాణం తగ్గి నాణ్యత, దిగుబడి కోల్పోతుంది.

▶ జింకు లోపం

భాస్వరం ఎక్కువగా వాడితే జింకు లోపం కనిపిస్తుంది. ఆకుల కనుపుల మధ్య పసుపుపచ్చ రంగులోకి మారి రాలిపోతుంది.

నివారణ చర్యలు :

జింకు లోపం నివారణకు లీటర్ నీటిలో 2 గ్రాముల చీలేటెడ్ జింక్ ను కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలి.

నివారణ చర్యలు :

లీటర్ నీటిలో 1.5 గ్రాముల అసిఫేట్ లేదా ఒక మి.లీ. నువులురాన్, లేదా 0.3 మి.లీ. రైనాక్సీపైర్ లేదా 0.3 గ్రాముల ఫ్లూబెండమైడ్‌ను కలిపి పిచికారీ చేయాలి.

▶ పక్షి కన్ను మచ్చ తెగులు

తేమతో కూడిన చల్లటి వాతావరణంలో మిరప ఆకులపై సర్కోస్పోరా, ఆల్టర్‌నేరియా మచ్చలు ఆశిస్తాయి. సర్కోస్పోరా ఆశించినట్లయితే పక్షికన్ను ఆకారం గల మచ్చలు ఏర్పడుతాయి. ఈ ప్రభావంతో పంటలో నాణ్యత, రంగు తగ్గుతాయి.

నివారణ చర్యలు :

200 లీటర్ల నీటిలో 200 మి.లీ. ప్రొపికోనజోల్‌ను కలిపి ఎకరం పొలంలో పిచికారీ చేసుకోవాలి. లేదా 100 మి.లీ. డైఫెన్‌కొనజోల్‌ను కలిపి పిచికారీ చేయాలి.